క్లుప్తంగా

ముగిసిన రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


పుష్ప పల్లకిలో ఊరేగుతున్న స్వామివారు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం ధ్వజావరోహణ పూజలను విశేషంగా జరిపించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనార్థం ఉంచారు. రాత్రి వడాయత్తు ఉత్సవాన్ని నిర్వహించారు. వేకువజాము వరకు పుష్ప పల్లకీ సేవ నిర్వహించారు. ఉభయదారులను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ప్రసాదం, పండ్లు అందజేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన 55 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 35 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

60 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పవన్

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పవన్ 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇంటి వద్ద మంచానికి గురైన రోగుల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరస్వతి, సుభాషిణి, అశ్విన్, శశి పాల్గొన్నారు.

21 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్ : మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పు ఇచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 21 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

పురస్కార గ్రహీతకు సత్కారం


తులసీనాథంను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇటీవల సీఎం చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడును నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం సభ్యులు సత్కరించారు. మంగళవారం గిరింపేట లోని కార్యాలయంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కరణం విమల మాట్లాడుతూ.. ఆయనకు ఈ అవార్డు దక్కడం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మిట్టాలక్ష్మి, సంధ్యాశర్మ, మురళి, చాణుక్య, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం సుందరయ్యవీధిలోని అపోలో క్లినిక్‌లో బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు వైద్యులు ప్రతాప్, సింధు తెలిపారు. ఈఎన్‌టీ, చర్మ సంబంధిత సమస్యలకు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని చిత్తూరువాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఏపీ ఈఏపీసెట్–2025 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు మరో 9 రోజుల్లో ముగియనుంది. సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విడుదల చేసిన ఏపీ ఈఏపీసెట్–2025కు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంది. ఏపీ ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు తమ ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలో ఎక్కడైనా ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశం పొందవచ్చు. – బంగారుపాళెం

ఉన్నత లక్ష్యాలకు తొలి మెట్టు

- ఏపీఈఏపీ సెట్‌కు సమీపిస్తున్న గడువు
- దరఖాస్తు చేసేందుకు ఈ నెల 24 చివరి తేదీ
- ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు పరీక్ష
- మే 19, 20వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్

సీనియర్ ఇంటర్ పరీక్షలు రాసిన ఎంపీసీ, బైపీసీ గ్రూపుల విద్యార్థులు cetr.aprche.ap.gov.in వెబ్‌సైట్‌కు లాగిన్ అయ్యి ఏపీ ఈఏపీసెట్–2025ను ఎంపిక చేసుకోవాలి. ఏపీఈఏపీసెట్ సైట్‌లో పరీక్ష రాసేందుకు అర్హతలు, ఏపీ ఈఏపీ సెట్‌కు సంబంధించిన ముఖ్యమైన తేదీలు, ఇన్‌స్ట్రక్షన్స్ మాన్యువల్ తదితర పూర్తి వివరాలను పొందవచ్చు.

ధ్రువపత్రాల వివరాలు తప్పనిసరి

ఏపీ ఈఏపీ సెట్‌కు దరఖాస్తు చేసే సమయంలో వివిధ కేటగిరీల పరిధిలోకి వచ్చే విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలు తప్పనిసరిగా సిద్ధం చేసుకోవాలి. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్ కేటగిరీల వారీగా తమ సామాజిక వర్గాన్ని ఎంపిక చేసుకుని ఆన్‌లైన్ అప్లికేషన్‌లో క్లిక్ చేయాలి. అదేవిధంగా సంబంధిత ధ్రువపత్రానికి సంబంధించిన నంబరును నమోదు చేయాల్సి ఉంటుంది. ఈడబ్ల్యూఎస్, ఆదాయ ధ్రువపత్రాల నంబరును సైతం విధిగా నమోదు చేయాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత తీసుకున్న ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకుంటారు. విద్యార్థుల స్థానికత నిర్ధారణకు 6వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు ఏ విద్యాసంస్థల్లో, ఏ ఊరిలో చదివారనే వివరాలను ఆయా విద్యా సంవత్సరాల వారీగా నమోదు చేయాలి. చివర్లో ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష ఏ జిల్లాలో రాస్తారనే సమాచారంతో కూడిన ట్యాబ్‌లను ప్రాధాన్యత క్రమంలో క్లిక్ చేయాలి. ఉదాహరణకు చిత్తూరు జిల్లాకు చెందిన విద్యార్థి తన స్వంత జిల్లాలో పరీక్ష రాసేందుకు ఆప్షన్ ఎంపిక చేసుకున్నప్పటికీ, అక్కడి పరీక్ష కేంద్రంలో పరిమితి మించిపోవడం, ఇతరత్రా కారణాలతో పరీక్ష కేంద్రం అందుబాటులో లేకుంటే తరువాత వరుస క్రమంలో ఇచ్చిన ప్రాధాన్యతలవారీగా ఆయా జిల్లాల్లో పరీక్ష కేంద్రాన్ని కేటాయిస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసి సబ్‌మిట్ చేసిన తరువాత ప్రింటవుట్ తీసుకోవాలి. పరీక్ష జరిగే రోజున ఏపీ ఈఏపీ సెట్ హాల్ టిక్కెట్‌తోపాటు ఆన్‌లైన్ ప్రింటవుట్ కాపీపై ఫొటో అంటించి పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌కు అందజేయాలి.



దరఖాస్తు విధానం

ఏపీఈఏపీసెట్–2025 సైట్‌కు లాగిన్ అయిన తరువాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఐదు దశల్లోని ప్రక్రియను పూర్తి చేయాలి. స్టెప్–1 మొదలు స్టెప్–5 వరకు ఐదు దశల్లో కనిపించే ట్యాబ్‌లను వరుస క్రమంలో క్లిక్ చేస్తూ, పొందుపరిచిన వివరాలు పూర్తి చేయాల్సి ఉంటుంది.

- స్టెప్–1: 'ఎలిజిబులిటీ క్రైటీరియా అండ్ ఫీజు పేమెంట్'కు లాగిన్ అయ్యి సీనియర్ ఇంటర్ హాల్‌టికెట్ నంబరు ఎంటర్ చేయాలి. విద్యార్థి పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, ప్రత్యామ్నాయ మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ నమోదు చేయాలి. ఇంజినీరింగ్–ఫార్మసీ, అగ్రికల్చర్–ఫార్మసీ, బోత్ ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, ఫార్మసీల వారీగా తాము రాయబోయే ప్రవేశ పరీక్ష, చేరనున్న కోర్సులవారీగా మూడు ఆప్షన్లలో ఒక దానిని ఎంపిక చేసుకుని, క్లిక్ చేయాలి. తరువాత సామాజిక వర్గాలవారీగా కేటగిరీపై క్లిక్ చేసి, ఆన్‌లైన్‌లో ఫీజు పేమెంట్ చేయాలి.
- స్టెప్–2: నో యువర్ పేమెంట్ స్టేటస్‌పై క్లిక్ చేసి, సీనియర్ ఇంటర్ హాల్ టికెట్ నంబరు, మొబైల్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు పూర్తి చేయాలి. తదుపరి చేరనున్న కోర్సుల వారీగా ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్‌లలో ఏదైనా ఒక దానిని ఎంపిక చేసుకుని క్లిక్ చేయడంతో స్టెప్–2 దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది.
- స్టెప్–3: ఫిల్ అప్లికేషన్‌లో పేమెంట్ చేసిన ఐడీతో పాటు సీనియర్ ఇంటర్ హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేయాలి. అనంతరం ప్రొసీడ్ టు ఫిల్ అప్లికేషన్‌పై క్లిక్ చేయాలి.
- స్టెప్–4: ఇక్కడ నో యువర్ అప్లికేషన్ స్టేటస్‌పై క్లిక్ చేసి, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాన్ని సందర్శించవచ్చు.
- స్టెప్–5: ఇక్కడ క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసిన దర ఖాస్తు ఫారాన్ని ప్రింట్ తీసుకుని భద్రపరచుకోవాలి.
- ఫీజు చెల్లించే సమయంలో ఇచ్చిన రిఫరెన్స్ ఐడీ, విద్యార్థి పేరు, సీనియర్ ఇంటర్ హాల్ టికెట్, పుట్టిన తేదీ వివరాలతో భవిష్యత్తులో ఈఏపీఈ సెట్ హాల్ టిక్కెట్, పరీక్షకు హాజరయ్యే సమయంలో సంబంధిత వివరాలు కీలకంగా మారుతాయి.

వెయ్యి రోజుల సంరక్షణే బిడ్డకు కీలకం

తవణంపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లో వెయ్యి రోజులు సంరక్షణే బిడ్డకు కీలకమని సీడీపీఓ జి.నిర్మల తెలిపారు. మండలంలోని సంతపల్లె, కె.పట్నం అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ భీ–పడాయ్ భీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ గర్భశిశువు నుంచి రెండేళ్ల వరకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఇచ్చే పోషణే ముఖ్యమన్నారు. పిల్లలకు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరుగుతోందని సూచించారు. షెడ్యూల్ ప్రకారం 9 నెలల వరకు అన్ని టీకాలు వేయించాలి. బిడ్డకు కేవలం తల్లిపాలనే ఆరు నెలలకు పట్టించాలని పేర్కొన్నారు. అనంతరం పిల్లలకు బాలామృతం రోజుకు వంద గ్రాములు చొప్పున తినిపించాలి. పిల్లలకు ఆహారంలో 5 గ్రాముల నెయ్యి కలిపి తినిపించాలన్నారు. దీంతో పాటు తల్లులు చేతులు, పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య మాట్లాడుతూ పిల్లలు వయసు తగిన బరువు, ఎత్తు ఉండేలా తల్లులు శ్రద్ధ చూపాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భవతులు, హెల్పర్లు పాల్గొన్నారు.


పుణ్యసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం గురించి వివరిస్తున్న సీడీపీఓ నిర్మల

వేసవిలో అప్రమత్తంగా ఉండండి

యాదమరి: వేసవికాలంలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని గ్రామీణ వైద్యాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని దాసరపల్లి గ్రామంలో మంగళవారం వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని చెప్పారు. రైతులు, పశువులు కాసేవారు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లరాదని సూచించారు. ఒకవేళ వడదెబ్బకు గురైతే తప్పక ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తప్పక సేవించాలని తద్వారా వడదెబ్బ నుంచి కాస్త ఉపశమనం కలుగుతుందని చెప్పారు. ఓఆర్‌ఎస్ ద్రావణాలు ఆరోగ్య కార్యకర్తల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశా కార్యకర్తలు రమాదేవి, భువనేశ్వరి పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి

గుడిపాల: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, స్థానిక సర్పంచ్ రజినీకాంత్ అన్నారు. వసంతాపురం సచివాలయంలో మంగళవారం అంగన్‌వాడీ పోషణ్ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే రక్తహీనత లేకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ఫుడ్‌ను తీసుకోవాలని, వీటి వల్ల అనేక రకాలైన లాభాలు ఉన్నాయన్నారు. బయట విక్రయించే ఫుడ్ న్యూడిల్స్, ఎగ్‌రైస్, గోబిరైస్ వంటి ఫాస్ట్‌ఫుడ్‌లలో వెనిగర్, టేస్టింగ్ సాల్ట్ కలపడంతో ఆరోగ్య సమస్యలు వస్తాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయలక్ష్మి, వీఆర్‌ఓ శ్రీనాథ్‌రెడ్డి, కార్యదర్శి సుందరేష్, మహిళా పోలీస్ పావని, ఏఎన్‌ఎం జబసెల్వి, సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, లక్ష్మి, ఆశా వర్కర్లు సుజిమ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.


పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు

వడదెబ్బపై అప్రమత్తత అవసరం

ఐరాల: ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని నాంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 60 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వేసవిలో ఎక్కువగా నీరు తాగాలని, అవసరమైతే తప్ప ఎండలో తిరగకూడదన్నారు. వడదెబ్బకు గురైన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్స గురించి వివరించారు. తలనొప్పి, తల తిరగడం, జ్వరం, ఫిట్స్ వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. కొబ్బరి నీళ్లు, ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.


గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత


ఇప్పుడు అదే చెట్టు చిగురిస్తున్న వైనం


గతేడాది డిసెంబరులో కూలిన ఎర్ర చందనం వృక్షం

చిదిమేసినా.. చిగురిస్తా..!

చిత్తూరు నగరంలోని రిజర్వు ఫారెస్టులో వాకింగ్ వెళ్లే ప్రతి ఒక్కరికీ ఈ ఎర్రచందనం చెట్టు సుపరిచితమే. ఎందుకంటే గతేడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు వాకింగ్‌కు వెళ్లే దారిలో రెండు ఎర్రచందనం చెట్లు నేలకూలాయి. కొన్నాళ్ల తరువాత రోడ్డుకు అడ్డుగా ఉన్న వృక్షాలను అధికారులు కొట్టించేశారు. కానీ ఇందులో ఒక ఎర్రచందనం చెట్టు మాత్రం పూర్తిగా మోడుబారిపోయింది. ఇప్పుడు మళ్లీ చిగురించింది. పడ్డచోటే బతికి చూపిస్తోంది. – చిత్తూరు అర్బన్

జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి

తవణంపల్లె: జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ వినయ్‌కుమార్ ప్రజలకు సూచించారు. మండలంలోని దిగువమత్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 32 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. మధుమేహంతో బాధపడుతున్న రోగులు విధిగా మందులు తినాలన్నారు. పల్లెచెరువులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

కొలిక్కి వస్తున్న వివాహిత మృతి కేసు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో పెళ్లయిన రెండు నెలలకే అనుమానాస్పద రీతిలో చనిపోయిన యాస్మిన్ భాను కేసు కొలిక్కి వస్తోంది. కులమతాలు వేరైన యాస్మిన్, సాయితేజ పెద్దలను ఎదిరించి ఈ ఏడాది ఫిబ్రవరిలో పెళ్లి చేసుకోవడం.. తండ్రి డిప్రెషన్‌లో ఉన్నాడని మూడు రోజుల క్రితం యాస్మిన్ ను ఆమె కుటుంబ సభ్యులు చిత్తూరుకు పిలిపించుకున్న అరగంటలో అనుమానాస్పదంగా మృతి చెందడం తెలిసిందే. బాలాజీ కాలనీలోని పుట్టింట్లో యాస్మిన్ ఇంటి పైకప్పునకు చున్నీతో వేలాడుతూ నిర్జీవంగా కనిపించడాన్ని తొలుత ఆమె తల్లి ముంతాజ్ గుర్తించింది. అప్పటికే తండ్రి షౌకత్ అలీ తిట్టడం, యాస్మిన్ చనిపోయిన వెంటనే తండ్రి కనిపించకుండా వెళ్లిపోవడం ఈ ఘటనలో పలు అనుమానాలను రేకెత్తించాయి. దీనికి తోడు పీసీఆర్ కూడలి నుంచి యాస్మిన్‌ను కారులో తీసుకెళ్లిన ఆమె అన్నదమ్ములు, అతని స్నేహితులు ఎవరూ కనిపించలేదు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు యాస్మిన్‌ను తీసుకెళ్లిన కారును స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇక మృతురాలి తండ్రి షౌకత్ అలీని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తే అసలు విషయం ఏంటనేది బయట పడనుంది. అలాగే యాస్మిన్‌ను కారులో ఇంటికి తీసుకెళ్లిన వాళ్లను కూడా పోలీసులు తమదైన శైలిలో విచారిస్తున్నారు.


యాస్మిన్ (ఫైల్)

ఫ్రూట్ కవర్లపై అవగాహన

పలమనేరు: మామిడికి ఫ్రూట్ కవర్లను కట్టడంపై మంగళవారం స్థానిక హార్టికల్చర్ అధికారులు మండలంలోని రామాపురంలో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. మామిడి తోటలో కాయలు నిమ్మకాయ సైజులో ఉన్న ఈ తరుణంలో కవర్లను ఎలా కట్టాలో ప్రదర్శన పూర్వకంగా తెలియజేశారు. మామిడికి కవర్లకు కట్టడం వలన ఎలాంటి చీడపీడల బెడద లేకుండా కాయ మంచి రంగు, నాణ్యత కలిగి మంచి దిగుబడి వస్తుందని, దీనివల్ల ధర పలుకుతుందని స్థానిక హార్టికల్చర్ ఆఫీసర్ లక్ష్మీప్రసూన అన్నారు. తమ శాఖ ద్వారా రైతులకు 50శాతం సబ్సిడీతో మామిడి కవర్లను ఇప్పటికే అందజేశామన్నారు.

యాస్మిన్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

చిత్తూరు కార్పొరేషన్: మతాంతర వివాహం చేసుకున్న యాస్మిన్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసులు ఆమె మృతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రేమ వివాహం కావడంతో మొదటి నుంచి అమ్మాయి తల్లిదండ్రులు వారి పెళ్లిని అంగీకరించలేదని చెప్పారు. తండ్రి దిగులు పడదని ఆమెను ఇంటికి పిలిపించిన క్షణాల్లో మరణ వార్త వినడం దుర్మార్గమన్నారు. పరువు పేరుతో కన్నబిడ్డలను హత్య చేయడం గతంలో కూడా పలమనేరు ప్రాంతంలో జరిగిందని గుర్తు చేశారు. భర్త కూడా హత్యేనని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాధితుడికి న్యాయం చేయాలని వివరించారు.

ఈ ముంజలు తింటే ఎన్ని లాభాలో!

గుడిపాల: ఎండాకాలంలో విరివిగా లభించే తాటి ముంజలు తింటే ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇవి వేసవి తాపాన్ని తగ్గించడంతోపాటు పోషక విలువలు కూడా అందిస్తాయని పేర్కొంటున్నారు. ఏప్రిల్‌లో ప్రారంభమైన ముంజల సీజన్ మే నెలాఖరు వరకు ఉంటుంది. సీజన్‌లో మాత్రమే దొరికేవి కావడంతో వీటి ధర కూడా బాగానే ఉంటుంది. తాటి ముంజలు వేసవి తాపాన్ని తీర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా దాహం తీర్చుతాయి. ముంజలో దాదాపు 87 శాతం నీరే ఉంటుంది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గి, జీర్ణక్రియ బాగా ఉంటుందని పేర్కొంటున్నారు.

పోషక విలువలు ఎక్కువే

వందగ్రాముల తాటిముంజల్లో విటమిన్–ఏ సమృద్ధిగా లభిస్తుంది. దీంతో పాటు థయామిన్, నియాసిస్ వంటి విటమిన్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఖనిజ లవణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటర్ లక్షణాలు కలిగి వాపును తగ్గిస్తాయి. వీటిని తింటే ఆకలి పెరుగుతుంది. చిన్నారులు, వృద్ధులకు ఇవి ఎంతో మేలుచేస్తాయి. గుండె జబ్బులు, చక్కెర వ్యాధిగ్రస్తులకు ముంజలు ఎంతో మేలు చేస్తాయి. పీచు పదార్థం ఉండడం వల్ల మలబద్ధకం లేకుండా ఉంటుంది.


గుడిపాలలో తాటిముంజలు అమ్ముతున్న విక్రయదారులు